

సీఐలకు స్థానచలనం

విజయనగరం క్రైం, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు సీఐలకు స్థాన చలనం కల్పిస్తూ విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం సోషల్ మీడియా సైబర్ సెల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న ఎల్.అప్పలనాయుడును ఎస్.కోట సర్కిల్‌కు బదిలీ చేశారు. ఎస్.కోట సీఐ కె.రవికుమార్‌ను విశాఖలో వీఆర్‌కు పంపారు. వీఆర్‌లో వున్న డి.బంగారుపాపను సోషల్ మీడియా విజయనగరం సైబర్ సెల్‌కు బదిలీ చేశారు. సాకేటి శంకరరావును వీఆర్ నుంచి విజయనగరం డీసీఆర్‌బీ బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అప్పుడు ఆదుకోక.. ఇప్పుడు ఓర్వలేక

- రైతును మోసం చేసిన వైసీపీ సర్కారు
- నాడు రాయితీలు నిలిపివేత
- పథకాలకూ మంగళం
- అనుబంధరంగాలూ సర్వనాశనం
- మొసలి కన్నీరు కార్చుతూ నేడు ఆందోళనలకు పిలుపు



ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీస స్థాయిలో పనులు జరగని తారకరామ తీర్థసాగర్



వ్యవసాయ రంగాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్లూ రైతు భరోసాను సాకుగా చూపి పథకాలు, రాయితీలకు మంగళం పాడింది. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణను గాలికొదిలేసింది. మీడియం, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల వైపే చూడలేదు. ఇప్పుడు అధికారం దూరమయ్యేసరికి మొసలి కన్నీరు కారుస్తోంది. దగా ప్రభుత్వం అంటూ కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఐదేళ్ల అధికారంలో ఏమీ చేయని వైసీపీ, ఆరు నెలల్లో ఈ ప్రభుత్వం ఏమీ చేయలేదని వాదించడాన్ని రైతులు విమర్శిస్తున్నారు.

విజయనగరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవసాయాధారితం. వరి తరువాత మొక్కజొన్న, పత్తి, వేరుశనగ పంటలను ఎక్కువగా పండిస్తుంటారు. గత ప్రభుత్వం నుంచి రైతుకు ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం దక్కలేదు. తాను అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15 వేలు చొప్పున సాయం అందిస్తానని 2019 ఎన్నికల్లో జగన్ ప్రకటించారు. అందులో రూ.7500 మాత్రమే అందించారు. కేంద్రం ఇచ్చిన రూ.6 వేలు సైతం తన ఖాతాలో వేసుకున్నారు. ఇటీవల ముగిసిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం సాగుకు సాయంగా ఏటా రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చింది. అమలు చేసేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. సంక్రాంతి నాటికి అమలుకు సన్నాహాలు చేస్తోంది. కాగా జిల్లాలో ప్రధాన సాగునీటి వనరులుగా తోటపల్లి, తారకరామ తీర్థసాగర్, మడ్డువలస, తాటిపూడి, వెంగళరాయసాగర్, ఒట్టిగెడ్డ ప్రాజెక్టులున్నాయి. ఇవి గత ఐదు సంవత్సరాలుగా ఎటువంటి అభివృద్ధికీ నోచుకోలేదు. వాటిని ముందుగా గాడిలో పెడితేనే వ్యవసాయాన్ని ప్రోత్సహించినట్టు అవుతుంది. జిల్లాలో 97,397 హెక్టార్లలో రైతులు వరిసాగు చేస్తున్నారు. మొక్కజొన్న, వేరుశనగ, పత్తి, చెరకు, అపరాలు వేలాది ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వీటన్నింటికీ పుష్కలంగా నీరు అందించాల్సిన అవసరం ఉంది.

కళ తప్పిన మార్కెట్ కమిటీలు

జిల్లాలో మార్కెటింగ్ శాఖ సైతం నిర్వీర్యమైంది. గతంలో ఆర్థిక పరిపుష్టితో మార్కెట్ కమిటీలు కళకళలాడేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వాటి గోదాములను వినియోగించే పౌరసరఫరాల శాఖ, గృహనిర్మాణ శాఖలు అద్దెను సక్రమంగా చెల్లించడం లేదు. దీంతో మార్కెట్ శాఖలో ఉద్యోగులు, సిబ్బందికి జీతాలు ఇచ్చేందుకు కూడా ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. గత ఐదు సంవత్సరాల్లో జిల్లాలో మార్కెటింగ్ శాఖకు సెస్ రూపంలో రూ.50 కోట్ల వరకూ ఆదాయం సమకూరింది. గోదాముల అద్దె రూపంలో మరి కొంత ఆదాయం వచ్చింది. కానీ ఆదాయంలో నేరుగా 45 శాతం (మిగతా 8వ పేజీలో...)

నేడు వైసీపీ నిరసన ర్యాలీ

విజయనగరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతు సమస్యలపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇచ్చిన పిలుపు మేరకు 'అన్నదాతకు అండగా వైసీపీ' నినాదంతో శుక్రవారం నిరశన చేపట్టనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.



వాటిని అమ్మేశారా?

జిల్లా వ్యాప్తంగా వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు పంటను ఇంటికి చేర్చే దశలో యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా యజమానులు వాటి అద్దెలను భారీగా పెంచేశారు. చేసేది లేక అడిగింది ఇచ్చి పనులు చేయించుకుంటున్నారు. అయితే ఇదంతా చూస్తున్న సగటు రైతులు వైసీపీ హయాంలో ఇచ్చిన సాగు యంత్రాలేవి?.. కస్టమ్ హైరింగ్ కేంద్రాలు ఎందుకు ఏర్పాటు చేసినట్లు? ఆ యంత్రాలను అమ్మేశారా? అని చర్చించుకుంటున్నారు. ట్రాక్టర్లు, నూర్పుడు యంత్రాలు, రొటోవేటర్లు, పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు, పవర్ వీడర్లు ఎక్కడున్నాయని ప్రశ్నిస్తున్నారు.

- కనిపించని సాగు యంత్రాలు
- అప్పట్లో వైసీపీ ప్రచార ఆర్భాటం
- అధికార పార్టీ నేతలకే దాసోహం
- యంత్రసేవ పథకంలో అక్రమాలు

విజయనగరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ యంత్రాసేవ పథకంలో రైతులను గ్రూపులుగా విభజించారు. ఆ గ్రూపులో అధికార వైసీపీ సానుభూతిపరులే ఎక్కువ ఉండేవారు. వారినే కస్టమ్ హైరింగ్ కేంద్రాల సభ్యులుగా కూడా పరిగణించారు. వీరు వ్యవసాయ పరికరాల కొనుగోలుకు పది శాతం సొమ్ము కడితే 40 శాతం ప్రభుత్వం రాయితీ ఇచ్చింది. మిగతా 50 శాతం బ్యాంకు రుణం. అయితే అసలు కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఉన్నట్లు నేటికీ చాలామందికి తెలియదు. వాస్తవానికి క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు పరిశీలించి నిజమైన రైతులను గుర్తించాలి. కానీ అలా జరగలేదు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల సిఫార్సు మేరకు కొంతమంది రైతులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. వారి పేరుతో కస్టమ్ హైరింగ్ సెంటర్లను నడుపుతున్నారు.

జిల్లాకు రెండు విడతల్లో వైఎస్సార్ యంత్రా సేవా పథకం కింద 335 ట్రాక్టర్లను అందించినట్టు చెబుతున్నారు. అవి క్షేత్రస్థాయిలో ఎక్కడ ఉన్నాయో తెలియడం లేదు. వైసీపీ స్థానిక ప్రజాప్రతినిధుల ఇంటి వద్ద, కల్లాల్లో ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. రైతుభరోసా కేంద్రాలు సైతం వైసీపీ చోటా నేతల కబంధ హస్తాల్లో ఉండడంతో వీటిని వారే వాడుకుంటున్నారు. జిల్లాలో ఎక్కువగా ఎస్.కోట నియోజకవర్గానికి ట్రాక్టర్లు అందించారు. మొత్తం 70 ట్రాక్టర్లు అందించినట్టు గణాంకాలు చెబుతున్నాయి. బొబ్బిలి నియోజకవర్గానికి 59, గజపతినగరం నియోజకవర్గానికి 60, చీపురుపల్లికి 37, రాజాంకు 66, విజయనగరంకు 13, నెల్లిమర్లకు 40 ట్రాక్టర్లు అందించినట్టు చెబుతున్నారు. అయితే వందలాది పంచాయతీలు, దానికి రెట్టింపు ఉన్న గ్రామాలకు ఈ యంత్రాలు ఏమూలకు సరిపోవడం లేదు. అలాగని రైతులందరి సేవలకు వినియోగించడం లేదు. దీంతో చిన్న, సన్నకారు రైతులు ప్రైవేటు ట్రాక్టర్లు, పరికరాలపై ఆధారపడుతున్నారు.

జిల్లా దాటిపోయాయా?

యంత్రసేవా పథకం ద్వారా మంజూరైన వ్యవసాయ యంత్రాలను చేజిక్కించుకున్న వైసీపీ నేతలు, వారి సానుభూతిపరులు కొన్నాళ్లకే అమ్మి సొమ్ముచేసుకున్నారని తెలిసింది. ఈ యంత్రాలు కొన్ని జిల్లా సరిహద్దులు దాటిపోయాయంటే నమ్మక తప్పదు. 40 శాతం వరకు యంత్రాలు, ఆయా వైసీపీ నేతల వద్ద ఉన్నట్లు వినికిడి. ఉన్నతాధికారులు పర్యవేక్షణ, తనిఖీలకు వచ్చినప్పుడు వాటిలో కొన్నింటిని చూపించి గట్టెక్కుతున్నారు.

పరికరాలదీ అదే తీరు

యంత్ర పరికరాలదీ అదే తీరు. తొలి విడతలో 326 గ్రూపులకు, రెండో విడతలో 184 గ్రూపులకు యంత్ర పరికరాలు అందించారు. మొదటి విడత అందించిన పరికరాల విలువ రూ.28.45 కోట్లు.. ఇందుకుగాను ప్రభుత్వం అందించిన రాయితీ రూ.9.34 కోట్లు, రెండో విడత పరికరాల విలువ రూ.15.10 కోట్లు.. రాయితీ రూ.4 కోట్లపైమాటే. అయితే ఇంత ఖర్చుపెట్టి అందించిన ట్రాక్టర్లు, పరికరాలు నిజమైన రైతులకు అద్దెకు దొరకడం లేదు. దీంతో అధిక అద్దెలు చెల్లించి మరీ రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారు.

వాహనాలు లేవు

కస్టమ్ హైరింగ్ కేంద్రాలు ఆర్బీకేలకు అనుసంధానంగా పనిచేస్తాయని చెప్పారు. ఎక్కడా యంత్రాలు లేవు, వాహనాలు లేవు.ప్రస్తుతం వరి కోతలు జరుగుతున్నాయి. వాతావరణం బాగాలేదు. అధిక అద్దె ఇచ్చుకొని వరి కోతలు, నూర్పులు చేయాల్సి వస్తోంది.

- సిరిపురం రామకృష్ణ, రైతు, పిట్టాడ

ప్రచార ఆర్భాటమే

రైతుభరోసా కేంద్రాల ద్వారా వాహనాలు, యంత్రాలను అద్దెకు అందిస్తామంటే ఎంతో సంతోషపడ్డాం. కానీ గ్రామాల్లో అటువంటి ఏర్పాట్లు చేయలేదు. కేవలం ప్రచార ఆర్భాటం తప్ప మరొకటి కనిపించ లేదు. ప్రస్తుత వ్యవసాయ పనులకోసం ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పడం లేదు. అద్దెలు ఎక్కువ తీసుకుంటున్నారు.

- పల్లె భాస్కరరావు, రైతు, పినతాడివాడ, డెంకాడ మండలం



అభివృద్ధి పథంలో నడిపించండి

- కలెక్టర్లతో సీఎం చంద్రబాబు

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని రంగాలను అభివృద్ధి పథంలో నడిపించాలని సీఎం చంద్రబాబునాయుడు సూచించారు. రెండు రోజులుగా అమరావతిలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో గురువారం సీఎం మాట్లాడుతూ అభివృద్ధిపైనే దిశానిర్దేశం చేశారు. అభివృద్ధితో పాటు సంక్షేమం పరుగులు పెట్టించాలన్నారు. ప్రభుత్వ పథకాలు చిట్టచివరి లబ్ధిదారుడుకి చేరేలా కృషి చేయాలని, పథకాల్లో అనర్హులుంటే తొలగించాలని ఆదేశించారు. కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాల్గొన్నారు.

కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అంబేడ్కర్



ఇంత నిర్లక్ష్యమా?

- జిల్లాలో తరచూ విద్యుత్ ప్రమాదాలు
- తీగలను సరిచేయని అధికారులు
- విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత
- పట్టించుకోని ఉన్నతాధికారులు

6లో




బీపీలు.. షుగర్లు!

- జిల్లాలో పెరుగుతున్న వ్యాధిగ్రస్థులు
- బాధితుల్లో ఎక్కువ మంది యువత
- ప్రమాదమని హెచ్చరిస్తున్న నిపుణులు

6లో





బొగ్గులోడులో గంజాయి

- బెడిసికొట్టిన రవాణాదారుల వ్యూహం
- గుట్టు కనిపెట్టిన పోలీసులు
- 800 కిలోల సరుకు పట్టివేత
- అదుపులో ముగ్గురు వ్యక్తులు
- మూడు వాహనాల స్వాధీనం



గంజాయిని తరలిస్తున్న బొగ్గులోడు లారీ ఇదే..



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

రామభద్రపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొట్టక్కి చెక్‌పోస్టు వద్ద గురువారం ఉదయం భారీ ఎత్తున గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పక్కా సమాచారంతో పట్టుకున్నారు. రెండో కంటికి తెలియకుండా బొగ్గులోడులో గంజాయి దాచి తరలించాలనుకున్న రవాణాదారుల వ్యూహాన్ని చాకచక్యంగా ఛేదించారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ఒడిశా రాష్ట్రం పాడువా నుంచి తొలుత రెండు మినీ వాహనాల్లో 30 బ్యాగులతో సుమారు 800 కిలోల గంజాయిని పాచిపెంట మండలం వరకు తీసుకొచ్చారు. అక్కడ బొగ్గులోడుతో ఉన్న లారీలోకి గంజాయిని మార్చారు. వాటిపైన కూడా బొగ్గు బస్తాలు కప్పేశారు. ఎవరికీ అనుమానం రాదనుకున్నారు. పక్కా సమాచారంతో బొబ్బిలి సీఐ కె.నారాయణ రావు, రామభద్రపురం ఎస్ఐ వెలమల ప్రసాదరావుల బృందం బుధ వారం అర్ధరాత్రి నుంచి కొట్టక్కి వద్ద ఒడిశా నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. బొగ్గు లారీ కొట్టక్కి సమీపానికి రాగానే చెక్‌పోస్టు వద్ద పోలీసులు మెరుపుదాడి చేసి అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తనిఖీ చేయగా గంజాయి మూట్లను గుర్తించారు. వెనుక అనుసరిస్తున్న రెండు వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. మరికొంతమంది పరారైనట్టు సమాచారం. చెక్‌పోస్టు వద్ద బొగ్గులారీలో ఉన్న గంజాయి బస్తాలను కిందకు దించి తూకం వేసి రామభద్రపురం పోలీసు స్టేషన్‌కు తరలించారు. పెద్ద మొత్తంలో గంజాయి దొరకడం రామభద్రపురంలో మొదటిసారి. సూత్రదారుల కోసం నిందితులను పోలీసులు విచారిస్తున్నారు.

స్వర్ణాంధ్ర విజన్‌కు మేము సైతం

- విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణలో పాల్గొనేందుకు తరలివెళ్లిన ప్రముఖులు




వాహనాలను ప్రారంభిస్తున్న జేసీ సేతుమాధవన్



విజయనగరం నుంచి బయలుదేరిన మహిళలు

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం విజయవాడలో స్వర్ణాంధ్ర డాక్యుమెంట్ 2047ను విడుదల చేయనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నుంచి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ప్రతినిధులు తరలివెళ్లారు. వారి వాహనాలను జేసీ సేతు మాధవన్ గురువారం కలెక్టరేట్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్వో శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు తలపెట్టిన ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి జిల్లా నుంచి ఐదు బస్సుల్లో వివిధ రంగాలకు చెందిన సుమారు 25 మంది ప్రతినిధులను పంపిస్తున్నామని చెప్పారు. వీరేకాకుండా మరో 60 మంది అత్యంత ప్రముఖులను కూడా ఇతర వాహనాల్లో రాజధానికి పంపిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ రామారావు, ఎస్‌డీసీలు మురళీకృష్ణ, సుధారాణి, సీపీవో కార్యాలయం ఏడీ రామలక్ష్మి, డీపీఆర్వో రమేష్, కలెక్టరేట్ ఏవో దేవిప్రసాద్‌లు ఉన్నారు. కాగా స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ -2047 విడుదల కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించేందుకు శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాట్లు చేయనున్నారు.



బీపీలు.. షుగర్లు!

● జిల్లాలో పెరుగుతున్న వ్యాధిగ్రస్థులు ● బాధితుల్లో ఎక్కువ మంది యువత ● ప్రమాదమని హెచ్చరిస్తున్న నిపుణులు



రాజాం, డిసెంబరు 12

● రాజాం వస్త్రపురి కాలనీకి చెందిన పార్వతి వయస్సు 28. ఇటీవల చాలా నీరసంగా ఉండటంతో ఆసుపత్రికి వెళ్లింది. అక్కడ వైద్య పరీక్షలు చేయగా బీపీ పెరిగినట్టు తేలింది. రక్తంలో చక్కెర శాతం కూడా ఎక్కువగా ఉంది. అప్పటి నుంచి పార్వతి వైద్యుల సూచన మేరకు మందులు వాడుతోంది.

● రాజాం పట్టణంలో శ్రీనివాస్ అనే యువకుడు షాపు నిర్వహిస్తుంటాడు. రోజంతా క్షణం తీరిక లేకుండా కూర్చుని ఉండాలి. ఇటీవల జ్వరం బారిన పడడంతో వైద్యులు వివిధ పరీక్షలకు సిఫారసు చేశారు. అయితే పరీక్షల్లో అతడికి బీపీ, షుగర్‌తో పాటు అల్సర్ కూడా ఉందని తేలింది.



మనిషి దైనందిక జీవితం మారింది. గతం మాదిరిగా ప్రశాంత జీవనం కొరవడింది. ఆహారపు అలవాట్లు మారాయి. కొందరు వ్యసనాల బారిన పడుతున్నారు. తద్వారా రుగ్మతలు పెరుగుతున్నాయి. దీనికి తోడు కుటుంబ సమస్యలు తోడవడంతో చాలామంది ఒత్తిడికి గురవుతున్నారు. ఈ క్రమంలో బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. ఇలాంటి రుగ్మతలు బారిన పడుతున్న వారి సంఖ్య ఇటీవల పెరుగుతూ వస్తోంది. కొవ్వు పదార్థాలు అధికంగా తినడం వల్ల.. ఆహార నియమాలు పాటించకపోవడం వల్ల జబ్బులు పెరుగుతున్నాయని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు చెబుతున్నాయి. గతంలో 50 సంవత్సరాలు పైబడిన వారే ఈ వ్యాధుల బారిన పడేవారు. ఇప్పుడు 30 ఏళ్లకే వాటితో ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది.

ఎన్‌సీడీ కేంద్రాల్లో నిర్ధారణ..

జిల్లా కేంద్రాస్పత్రితో పాటు రెండు ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయి. అక్కడ ఎన్‌సీడీ కేంద్రాల్లో ఉచితంగా షుగర్, బీపీ, గుండె పరీక్షలు చేస్తున్నారు. ఇది తెలియక చాలామంది సరిగ్గా వినియోగించుకోవడం లేదు. వైద్య ఆరోగ్య శాఖ గణాంకాలు ప్రకారం జిల్లాలో 52,792 మంది బీపీతో బాధపడుతున్నారు. 39,131 మంది షుగర్ వ్యాధిగ్రస్థులు ఉన్నారు. గత ఏడాది కాలంలో 72,720 మందికి వైద్య పరీక్షలు చేయగా.. 2905 మందికి బీపీ బారిన పడినట్టు తేలింది. 62,895 మందికి షుగర్ టెస్టు చేయగా.. 2,113 మందికి వ్యాధి నిర్ధారణ అయింది. గత ఐదేళ్ల కాలంలో బీపీ, సుగర్ బారిన పడుతున్నవారిలో 40 శాతం మంది యువతే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో కన్నా పట్టణ ప్రాంతాల యువత ఎక్కువగా వ్యాధుల బారిన పడుతున్నారు.

వాటితో అనర్థం..

ఫాస్ట్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్ అధికంగా తినడం ఆరోగ్యానికి అనర్థం. టీవీని అదే పనిగా చూడడం వల్ల కూడా బీపీ, షుగర్ వంటి వ్యాధులు వస్తాయి. శారీరక వ్యాయామం లేకపోవడం, పనిచేసిన చోట గంటల తరబడి కూర్చోవడం వంటి కారణాలతో కూడా వ్యాధులు సక్రమించే ప్రమాదం ఉంది. పొగ తాగడం, అల్కాహాల్‌కు బానిస కావడం వల్ల కూడా వ్యాధి మరింత ముదిరే ఆస్కారం ఉంది. అయితే కొవిడ్ అనంతరం వ్యాధులు విజృంభిస్తున్నాయి. వారూ వీరూ అన్న తేడా లేకుండా సంక్రమిస్తున్నాయి. కరోనా సమయంలో వైరస్ బారిన పడుతున్న వారిలో ఎక్కువగా వ్యాధులు బయటపడుతున్నాయి. ముఖ్యంగా షుగర్ వ్యాధి ప్రతిఇంట్లో ఎవరో ఒకరికి బయటపడుతుండడం ఆందోళన కలిగిస్తోంది.


ఆహారపు అలవాట్లు.. మార్పులు

బీపీ, షుగర్‌ను నియంత్రించుకోవాలంటే ప్రధానంగా ఆహారపు అలవాట్లలో మార్పులు తప్పనిసరి. చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. సాయంత్రం 7 గంటల్లోపే భోజనం చేసుకోవాలి. ఆహారంలో పిండి పదార్థాలు తక్కువగా ఉండి పీచు పదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ప్రతిరోజూ విధిగా వ్యాయామం చేయాలి. కనీసం అరగంట పాటైనా చేయాలి. ప్రతిరోజూ నడక తప్పనిసరి. మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలి. పొగ తాగడం, మద్యం సేవించడం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలి. యోగాను జీవన విధానంలో ఒక భాగం చేసుకోవాలి. ఉప్పు, మసాలాలను తగ్గించుకోవాలి. జంక్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్స్‌కు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. చక్కెర వ్యాధిని అదుపులో ఉంచుకోవాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి..

ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. కొవిడ్ తరువాత చాలారకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శరీరంలో చాలా రకాల అవయవాలపై వైరస్ ప్రభావం చూపింది. ముఖ్యంగా బీపీ, షుగర్ వ్యాధులు పెరుగుతున్నాయి. అందుకే ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాయామం చేయలి. వ్యసనాలకు దూరంగా ఉండాలి.

-గార రవిప్రసాద్, వైద్యుడు, రాజాం



భక్తిశ్రద్ధలతో అగ్నిగుండం ప్రవేశం

జామి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జామిలో గురువారం రాత్రి భవానీమాలధారులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండంలో ప్రవేశించారు. ఈ సందర్భంగా వందలాది మంది మాలధారులు శూలాలు ధరించి అగ్నిగుండం తొక్కి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వహించిన దుర్గమ్మ పూజల్లో భక్తులు పాల్గొన్నారు.



శూలం ధరించి అగ్నిగుండం తొక్కుతున్న భవానీ మాలధారుడు



పరుగు పందెం పోటీల్లో విద్యార్థులు

సైనిక పాఠశాలలో క్రీడా సంబరాలు

● వార్షికోత్సవ అథ్లెటిక్ మీట్ ప్రారంభం

విజయనగరం టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ సైనిక పాఠశాలలో 62వ వార్షికోత్సవం పురస్కరించుకుని క్రీడా సంబరాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. అథ్లెటిక్ మీట్‌ను ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి శాంతి కపోతాన్ని ఎగురవేసి ప్రారంభించారు. విద్యార్థులు మార్చ్‌పాస్ట్‌తో ప్రిన్సిపాల్‌కు స్వాగతం పలికారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించిన క్రీడా పోటీల్లో చాళుక్య, గణపతి, గుప్త, మొఘల్ హౌస్‌లకు చెందిన 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 11 ట్రాక్ అంశాలు, 7 ఫీల్డు అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ నెల 21 వరకు క్రీడా సంబరాలు కొనసాగుతాయి. పోటీలను ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సైనిక పాఠశాల విద్యార్థులు విద్యతోపాటు, క్రీడల్లో రాణించి పాఠశాల కీర్తి ప్రతిష్ఠలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేయాలని అన్నారు. క్రీడలు మానసిక, శారీరక దారుఢ్యం మెరుగుపడేందుకు ఉపయోగపడతాయన్నారు. అందరూ క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శాస్త్రి



షాట్‌పుట్ విసురుతున్న క్రీడాకారుడు

రోడ్లు, కాలువలను ఆధునికీకరిస్తాం

● మరమ్మతుల కోసం బుడా నుంచి రూ.65 లక్షలు కేటాయింపు
● ల్యాండ్ బ్యాంకు ఏర్పాటుకు చర్యలు ● బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు



మాట్లాడుతున్న బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు

బొబ్బిలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని రహదారులు, కాలువలను ఆధునికీకరిస్తామని, మరమ్మతుల కోసం బుడా నుంచి రూ.65 లక్షలు కేటాయిస్తున్నామని బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి నుంచి దాడితల్లి గుడి జంక్షన్ వరకు రోడ్డు అధ్వానంగా తయారైనందున ఎమ్మెల్యే బేబీనాయన సిఫార్సు మేరకు బుడా నుంచి నిధులు కేటాయిస్తున్నామన్నారు. తన కార్యాలయంలో గురువారం సాయంత్రం విలేక రులతో మాట్లాడారు. రోడ్ల మరమ్మతుల కోసం రూ.40 లక్షలు, డ్రైనేజీల మరమ్మతుల కోసం రూ.25 లక్షలు చొప్పున కేటాయిస్తున్నామన్నారు. ఇటీవల అమరావతిలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ నిర్వహించిన సమావేశంలో బుడా పరిధిలో అభివృద్ధికి సంబంధించి పలు సూచనలు, ఆదే శాలిచ్చారని.. బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు మున్సిపాలిటీలకు రూ.కోటి చొప్పున బుడా నిధులను కేటాయించాలని ఆదేశించారన్నారు. మున్సిపాలిటీల పరిధిలో శాసనసభ్యులతో సంప్రదించిన తరువాత ఈ నిధులు కేటాయించాలని సూచించారన్నారు.

అలాగే బుడా పరిధిలో ల్యాండ్‌బ్యాంకును ఏర్పాటు చేసి భూములను సమీకరిస్తామన్నారు. ఇలా సేకరించిన భూముల్లో లేఅవుట్లు వేసి, వాటిల్లో అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించి ప్లాట్లను విక్రయిస్తామని తెలిపారు. సాలూరు ఎంఐజీ లేఅవుట్‌లో స్థలాల విక్రయం జరుగుతోందని, బొబ్బిలి, పార్వతీపురంలలో స్థల సేకరణ సమస్య ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో బొబ్బిలిలో బ్యూటిఫికేషన్ కోసం 3 కోట్ల బుడా నిధుల కోసం ప్రతిపా దించారని, పనులు మాత్రం చేయలేదన్నారు. అభివృద్ధి కోసం నిధుల లభ్యతను బట్టి పలు రకాల పనులను చేపడతామని తెంటు తెలిపారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలరు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు సుంకరి సాయిరమేష్ పాల్గొన్నారు.

కోటదుర్గమ్మా.. కరుణించు!

● వైభవవంగా మార్గశిరమాస పూజలు

పాలకొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి పాలకొండ కోట దుర్గమ్మ ఆలయం భక్తజనంతో కిటకిటలాడింది. మార్గశిరమాసం రెండో గురువారం సందర్భంగా ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీ ప్రసాదశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అష్టోత్తర శతకలశాభిషేకం, పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలు, ముగ్రాట పసుపు నీళ్లతో ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న కోటదుర్గమ్మను భక్తులు దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో సూర్యనారాయణ పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు.




పాలకొండ కోటదుర్గమ్మవారు



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఇంత నిర్లక్ష్యమా?

● జిల్లాలో తరచూ విద్యుత్ ప్రమాదాలు
● తీగలను సరిచేయని అధికారులు
● విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత
● పట్టించుకోని ఉన్నతాధికారులు
● అపాయంలో చిక్కుకుంటున్న ప్రజలు



● ఈ ఏడాది జూలై 5న మెంటాడ మండలం మీసాలపేటలో విద్యుదాఘాతంలో దంపతులు మృతిచెందారు. పొలాల్లో విద్యుత్ తీగలు తెగిపడడంతో ముందుగా భర్త మృతిచెందాడు. ఆయనను వెతుక్కుంటూ వెళ్లిన భార్య సైతం షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాతపడింది. కేవలం విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగినట్టు అప్పట్లో ఆరోపణలు వినిపించాయి.

● సెప్టెంబరు 26న అంట్లవరం గ్రా మంలో విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. పచ్చిగడ్డి కోసేందుకు పొలాల్లోకి వెళ్తూ విద్యుత్ తీగలు తెగిపడడంతో అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు.

● అక్టోబరు 16న రేగిడి మండల కేంద్రంలో జరిగిన ప్రమాదంలో 15 ఎకరాల చెరకు తోట దగ్ధమైంది. సుమారు రూ.15 లక్షల ఆస్తినష్టం సంభవించింది. విద్యుత్ షార్టు సర్క్యూట్‌తోనే ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. పొలాల గుండా వెళుతున్న వైర్లు రాపిడికి గురయ్యాయి. తద్వారా మంటలు వ్యాపించడంతో ప్రమాదం చోటుచేసుకుంది.

● అక్టోబరు 23న రేగిడి మండలం బొడ్డవలసలో ఇదే మాదిరి అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ తీగల రాపిడికి మంటలు వ్యాపించడంతో ఐదుగురు రైతులకు చెందిన చెరకు తోటలు కాలిపోయాయి. సుమారు రూ.3 లక్షల వరకూ నష్టం వాటిల్లింది.

విజయనగరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో విద్యుత్ శాఖ పనితీరు అస్తవ్యస్తంగా ఉంది. ఏదో ఒకచోట సమస్యలు తలెత్తుతూనే ఉన్నాయి. అటు ఉన్నతాధికారులు చెబుతున్న మాటలకు వాస్తవ పరిస్థితికి పొంతన ఉండడడం లేదు. ప్రధానంగా విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత ఉంది. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందితో పాటు పర్యవేక్షించే అధికారులు పూర్తి స్థాయిలో లేరు. అసిస్టెంట్ లైన్‌మన్లు, లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు, ఏడీల కొరత అధికంగా ఉంది. పదవీ విరమణతో చాలా పోస్టులు ఖాళీ అవుతున్నా భర్తీ చేయడం లేదు. అటు బదిలీలు, పదోన్నతులతో చాలా పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. దీంతో వినియోగదారులకు అత్యవసర సేవలు అందడం లేదు. అటు పాడైన విద్యుత్ పరికరాలతో సిబ్బంది కుస్తీలు పట్టాల్సి వస్తోంది.

● వాన పడితే విద్యుత్‌కు అంతరాయమే. ఒక్కోసారి రోజంతా చీకటిలో గడపాల్సిందే. కారణం గ్రామాల్లో ఫ్యూజు వేసే సిబ్బంది కూడా కరువే. రెండు మూడు గ్రామాలకు ఒక అసిస్టెంట్ లైనమ్యాన్ ఉండడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. చెరువుల్లో, పొలాల్లో విద్యుత్ తీగలు తెగిపోతే పట్టించుకునే నాథుడే ఉండడం లేదు. దీనివల్ల ప్రజలతో పాటు మూగజీవులు మృత్యువాత పడుతున్నాయి.

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 15 ఏజెన్సీ మండలాలు ఉన్నాయి. కేటగిరి-1కు సంబంధించి విద్యుత్ కనెక్షన్లు 6,71,921 ఉన్నాయి. కేటగిరీ-2కు సంబంధించి 68,398, కేటగిరీ-3కి సంబంధించి2,754, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 26,968 ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 1600 వరకూ రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. దాదాపు 300 మంది వరకూ మాత్రమే సిబ్బంది ఉన్నారు. వర్షాకాలం, తుఫాన్‌లు, అల్పపీడనం వల్ల వచ్చే ఈదురుగాలులు వీచే సమయంలో సిబ్బందిపడే బాధలు వర్ణనాతీతం. దీనికి తోడు దశాబ్దాలు కిందట వేసిన స్తంభాలు, విద్యుత్ లైన్లు ఎప్పటికప్పుడు పాడవుతున్నాయి. వాటిని సరిచేయాల్సిన ప్రభుత్వం మిన్నకుండిపోతోంది. అటు ట్రాన్స్‌ఫార్మర్లు సైతం ఏళ్లతరబడి మార్చడం లేదు. దీంతో తరచూ మొరాయిస్తున్నాయి.

చాలీచాలని సిబ్బంది..

ప్రస్తుతం జిల్లాలో ఏడీలు 21 మంది ఉన్నారు. ఏఈలు 67 మందికిగాను 51 మంది ఉండగా లైన్‌మెన్లు 172కు 152 మంది, అసిస్టెంట్ లైన్‌మెన్లు 200 మందికిగాను 140 మంది, జూనియర్ లైన్‌మెన్లు 222 మందికిగాను కేవలం 22 మంది మాత్రమే ఉన్నారు. సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లు 556 మంది ఉన్నట్టు చెబుతున్నారు. ఒక్కో మండలంలో 50కు మించి రెవెన్యూ గ్రామాలుంటాయి. కానీ ఉండేది నలుగురు లైన్‌మెన్లే. కొత్త విద్యుత్ కనెక్షన్లు, మొండి బకాయిల వసూలు, విద్యుత్ మరమ్మతు పనుల్లో పనిభారం ఎదుర్కొంటున్నారు.



సమస్యలు పరిష్కరిస్తున్నాం..

జిల్లాలో విద్యుత్ సమస్యలు రాకుండా చూస్తున్నాం. సిబ్బంది కొరత మాట వాస్తవమే. అయినా ఉన్న సిబ్బందితో పనిచేయిస్తున్నాం. అకాల వర్షాలు వచ్చినప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అటు గ్రామాల్లో ఎనర్జీ అసిస్టెంట్లు మంచి సేవలు అందిస్తున్నారు.

-లక్ష్మణరావు, ఎస్ఈ, విద్యుత్ శాఖ, విజయనగరం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సంతకవిటి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సంతకవిటి సబ్‌స్టేషన్‌లో హోంజరాం ఫీడర్ పరిధిలోగల మందరాడ, అక్కరాపల్లి, ముకుందపురం, గోవిందపురం, అప్పలఅగ్రహారం, చిత్తారపురం, హోంజరాం, గారన్నాయుడుపేట, చింతలపేట గ్రామాలకు శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విజయనగరం ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

19 నుంచి డిజిటల్ సమ్మెట్

భోగాపురం, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): ముంజేరు సమీప మిరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో డిజిటల్‌సమ్మెట్ ఈనెల 19నుంచి నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సీఈవో లోకం ప్రసాదు తెలిపారు గురువారం ముంజేరుసమీపంలోని ఆ సంస్థలో విలేకరులతో మాట్లాడుతూ సమ్మెట్‌కు దేశం నలుమూలలనుంచి 2000 మంది విద్యార్థులు హాజరుకానున్నారని చెప్పారు.

పారాలీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు

శృంగవరపుకోట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పారాలీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శృంగవరపుకోట మండల న్యాయ సేవా కమిటీ ఛైర్మన్, న్యాయాధికారి సబ్బవరపు వాణి ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. నియమితులైన వారికి ఎటువంటి పారితోషికం, జీతం ఉండదని తెలిపారు.ఆసక్తిగల వారు పూర్తివివరాలతో ఎస్.కోట, విజయనగరం కోర్టుప్రాంగణాల్లో గల మండల న్యాయ సేవాకమిటీ ఛైర్మన్ చిరునామాతో ఈనెల 25లోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

గోపాలపురంలో ఎస్‌టీపీ ఏర్పాటు

రాజాం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజాం మునిసిపాలిటీకి సంబంధించి మురుగునీటి శుద్ధికోసం గోపాలపురంలో ప్రత్యేక ప్లాంట్(ఎస్‌టీపీ) ఏర్పాటు చేయనున్నట్లు చీపురుపల్లి ఆర్డీవో సత్యవాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.24 వార్డులకు సంబంధించిన మురుగునీటి శుద్ధి కోసం ప్రభుత్వం తాజాగా ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.ఈమేరకు గోపాలపురం రెవెన్యూ పరిధిలో ఎనిమిది సెంట్లు భూమి ఆమోదయోగ్యంగా గుర్తించామని, ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి ఎటువంటి అభ్యంతరాలు ఉన్న తెలియజేయాలని కోరారు.

80 మందికి కంటి వైద్యపరీక్షలు

జామి,డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జామిలో గురువారం 80 మందికి కంటి వైద్య పరీక్షలను రెడ్‌క్రాస్ శాశ్వత సభ్యుడు బాల మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఉచితం చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

చీపురుపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి గీతా మందిరంలో నాలుగు రోజుల పాటు జరిగిన గీతా జయంత్యుత్సవాలు గురువారం ముగిశాయి.ఈ సందర్భంగా గరివిడి మండలంలోని కోనూరుకు చెందిన గణపతిరాజు అప్పలరాజు సమకూర్చిన భగవద్గీత పుస్తకాలను అందజేశారు.

అలకానంద కాలనీలో దుప్పట్లు..

విజయనగరం రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని అలకానంద కాలనీలో తమన్నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు, విశ్రాంత ఉద్యోగులు అంజిబాబు, విహార సంస్థ ప్రతినిధి హరినాథరావు, శివ, బొడ్డేపల్లి రామకృష్ణారావు పాల్గొన్నారు.

కేవీకే ఏర్పాటు చేయాలి

● ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



ఎస్‌పీ సింగ్‌బాఘేల్‌కు వినతిపత్రం అందజేస్తున్న కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గరివిడి పశు సంవర్థక కళాశాలలో కృషి విజ్ఞానకేంద్రం(కేవీకే) ఏర్పాటుచేయాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మత్స్య పశు సంవర్థక, డెయిరీ శాఖ సహాయ మంత్రి ఎస్‌పీ సింగ్ బాఘేల్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం

నెల్లిమర్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని ఐదో వార్డు సచివాలయం పరిధిలో గల పలు దుకాణాల్లో ఉన్న సుమారు ఐదు కిలోల ప్లాస్టిక్ కవర్లను కమిషనర్ కె.అప్పలరాజు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. మూడు వేల రూపాయలను జరిమానాగా విధించారు.గురువారం ఐదో వార్డు సచివాలయం ప్రాంతంలో దుకాణాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్‌ఐ డి.ఉమాభాస్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వార్డులో పర్యటిస్తున్న అప్పలరాజు

బిల్లులు కాక.. పనులు జరగక

● నిలిచిపోయిన సీహెచ్ బొడ్డవలస అంగన్‌వాడీ భవనం పనులు



అంగనవాడీ భవనం పనులు నిలిచిపోయిన దృశ్యం

బొబ్బిలి రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీహెచ్ బొడ్డవలసలో అంగన్‌వాడీ కేంద్రం భవనం పనులు బిల్లులు కాకపోవడంతో నిలిచిపోయాయి. ఇక్కడ అంగన్‌వాడీ కేంద్రం భవనం నిర్మాణానికి నాడు-నేడు ఫేజ్-2 కింద 14లక్షలు మంజూరయ్యాయి. ఇప్పటివరకూ ఏడులక్షలు అంగన్‌వాడీ ఎస్‌ఎంసీ ఖాతాల్లోకి విడుదలయ్యాయి. 20 వేలు మినహా 6.80 లక్షలు ఖర్చయ్యాయి. అయితే మిగిలిన నిధులు విడుదలైతే పనులు ప్రారంభిస్తామని ప్రధానోపాధ్యాయుడు జగదీష్‌బాబు తెలిపారు. ఈనేపథ్యంలో పనులు శ్లాబ్ లెవల్‌స్థాయిలో నిలిచిపోయాయి. భవనం పూర్తికాకపోవడంతో కేంద్రానికి వచ్చే బాలలు ఇబ్బందిపడుతున్నారు. కాగా సీహెచ్ బొడ్డవలసలో అంగన్‌వాడీ కేంద్రం భవనం పనులు నిలిచిపోవడంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని ఏఈ శ్రీరామ్ తెలిపారు. ఫేజ్ -2లో మంజూరైన ఈ భవనికి సగం నిధులు విడుదల చేశారనిచెప్పారు. మిగిలిన నిధులు విడుదల కాగానే పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామని తెలిపారు.

ఉనికి కోసం వైసీపీ పాట్లు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున



మాట్లాడుతున్న కిమిడి నాగార్జున

విజయనగరం డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లపాలనలో రైతులకు తీరని నష్టం చేసిన వైసీపీని ప్రజలు పక్కనపెట్టడంతో ఆ పార్టీ నాయకులు జిల్లాలో ఉనికి కోసం పాట్లు పడుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున ఎద్దేవాచేశారు. గురువారం విజయనగరంలోని టీడీపీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజుతో కలిసి విలేకరులతో మాట్లాడారు.వైసీపీ హయంలో రైతులను దగాచేశారని ఆరోపించారు. ధాన్యం కొనుగోలుకు ఆంక్షలుపెట్టి ఇబ్బందులకుగురిచేశారని, రైతుకు స్వేచ్ఛలేకుండా దళారీ వ్యవస్థ ద్వారా దోచుకున్నారని విమర్శించారు.ప్రజలు మరిచి పోకుండా ఉండేందుకే ఎన్నికలైన తర్వాత ఎప్పుడు బయటకు రాని వైసీపీ నాయకులు మీడియాలో కనిపించేందుకు కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు.ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుచేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమవుతున్నాయని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి అన్నివిధాలుగా కూటమి ప్రభుత్వం ఆదుకుంటోందని తెలిపారు. సమావేంలో మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ కనకల మురళీమెహన్, నారాయణప్పడు, కంది సాయి జగ్గారావు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో రోడ్లకు మహర్దశ

● రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్



రాజాం: రోడ్డు మరమ్మతులు పరిశీలిస్తున్న కోండ్రు మురళీమోహన్

రాజాం,డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో రోడ్లకు మహర్దశపట్టిందని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. గురువారం పొగిరిలో మిల్లులనుప్రారంభించారు. అనంతరం వీఆర్ అగ్రహారం వంతెన వద్ద గుంతలను పూడ్చే పనులు పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గానికి గంతలు పూడ్చేందుకు నాలుగు కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.

● వంగర, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. మండలంలోని బంగారువలసలో రైస్ మిల్లు ప్రారంభించి మాటాడారు. కాగా కేజీబీవీ విద్యార్థినులు ఎమ్మెల్యేకు తమ సమస్యలు వివరించారు. మురుగు నీటిసమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోత్స వాసుదేవరావు,పైలవెంకట రమణ, పిన్నింటి మోహన్, ఎల్.కృష్ణమూర్తి, ధనలక్ష్మి, రవి శ్రీను, త్రినాథ పాల్గొన్నారు.

సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేయాలి

శృంగవరపుకోట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజఅభియాన్ శిక్షణ నిర్వమించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల సహకారం అందినప్పుడే అధికారులు బాగా పనిచేయగలరని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సండి సోమేశ్వరరావు, ఎంపీడీవో సతీష్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి

● శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



శృంగవరపుకోట: రెవెన్యూ సదస్సులో అర్జీదారులతో మాట్లాడుతున్నఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

శృంగవరపుకోట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని శృంగవరపు కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి కోరారు. గురువారం శృంగవరపుకోటలో జరిగిన రెవెన్యూ సదస్సును ఆర్డీవో దాట్ల కీర్తి కూడా పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.అరుణకుమారి, టీడీపీ మండలాధ్యక్షుడు జీఎస్‌నాయుడు, ఎల్.కోట మాజీ జెడ్పీటీసీ కరెండ్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.

● రేగిడి, డిసెంబరు 12,(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో వచ్చిన భూసమస్యలు పీజీఆర్‌ఎస్‌లో నమోదుచేసి క్లియర్‌చేయాలని, ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు కోరారు.మండలంలో వెంకమ్మపేటలోజరిగిన సదస్సులో రైతుల నుంచి వస్తున్న వినతుల పై తహసీల్దార్ చిన్నారావు నుంచి అడిగి తెలుసుకున్నారు. తునివాడలో నిర్వహించిన సదస్సులో చీపురుపల్లి ఆర్డీవో జీవీ సత్యవతి మాట్లాడుతూ భూసమస్యలు పరిష్కారానికి సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా వెంకమ్మపేట మాజీ సర్పంచ్ బుగత సత్యనారాయణ ఇటీవల మృతిచెందడంపై కోండ్రు మురళీమోహనరావు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

● భోగాపురం, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వస్తున్న వినతులు 45 రోజుల్లో పరిష్కరించేలా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతుబంగార్రాజు తెలిపారు. మండలంలోని పోలిపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సురేష్, టీడీపీ మండలాధ్యక్షుడు కర్రోతుసత్యనారాయణ, సర్పంచ్ కర్రోతువెంకటరమణ పాల్గొన్నారు.

576 సంఘాల్లో విజయం సాధించాలి

లక్కవరపుకోట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): 576 సాగునీటి సంఘాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించాలని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. గురువారం లక్కవరపుకోటలో సాగునీటి సంఘ ఎన్నికలపై టీడీపీ నాయకులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని, అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏకగ్రీవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల రాంప్రసాద్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త వి.సత్యనారాయణ, కరెడ్ల ఈశ్వరరావు, జీఎస్.నాయుడు, మల్లునాయుడు పాల్గొన్నారు.

●రాజాం,డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):మండలంలోని శ్యాంపురం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ గురువారం కూటమి నాయకులతో నీటి సంఘాల ఎన్నికలపై నియోజకవర్గ స్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీప్రభుత్వం నీటిసంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో తమ ఉనికిని కోల్పోయాయని తెలిపారు.ఎన్నికలు నిర్వహించడంవల్ల భవిష్యత్‌లో కాలువల నిర్వహణకు సంబంధించిన సూచనలు సలహాలు నీటి వినియోగదారుల సంఘాల నుంచి తీసుకొని అందుకు అనుగుణంగా పనులు చేయించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించండి

బొండపల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పించాలని ఆర్‌సీఎం స్కూల్ ప్రిన్సిపాల్ శాంతి సిస్టర్‌కు బొబ్బిలి డిప్యూటీ డీఈవో బి.మోహనరావు సూచించారు. గురువారం మండలంలోని బోడసింగిపేటలోని ఆర్‌సీఎం స్కూల్‌లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సౌకర్యాలు తదితర విషయాలు అడిగితెలుసుకున్నారు.

లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సక్రమంగా నిర్వహించండి

● జిల్లా న్యాయాధికారి సాయి కల్యాణ్ చక్రవర్తి



సబ్ జైలును పరిశీలిస్తున్న న్యాయాధికారులు

చీపురుపల్లి, డిసెంబరు 12 (ఆంధ్ర జ్యోతి): జైళ్లలో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సక్రమంగా నిర్వహించాలని జిల్లా న్యాయాధికారి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంసంస్థ కార్యదర్శి టీవీ రాజేష్ కుమార్ ఆదేశించారు. గురువారం చీపురుపల్లిలోని సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జైలులోని ముద్దాయిలకు సకాలంలో న్యాయ సహాయం అందించడంకోసం ఈ క్లినిక్‌ల సక్రమంగా కొనసాగించాలని న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లను కోరారు. రిమాండ్‌లో ఉన్న ముద్దాయిలకు న్యాయ సహాయం అందించడమే లక్ష్యమని తెలిపారు.అనంతరం జైలులో అందుతున్న సౌకర్యాలపై ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. భోజన శాల, స్టోర్ రూములను పరిశీలించారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి: ఏఎస్పీ

విజయనగరం క్రైం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏఎస్పీ సౌమ్యలత కోరారు. గురువారం విజయనగరంలోని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీసు ఆంగ్ల పాఠశాలలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో కంటి, దంత తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, రోటరీక్లబ్ ప్రతినిధులు వినోద్‌కుమార్, నాగప్రసాద్, వీరభద్రరావు, సీఐ లీలారావు, ఆర్‌ఐలు గోపాలనాయుడు, శ్రీనివాసరావు, రమేష్‌కుమార్, వేల్ఫేర్ ఆర్‌ఎస్‌ఐ వరప్రసాద్, హెచ్‌ఎం సంధ్యలు పాల్గొన్నారు.

ఆదాడ మోహనరావుకు గద్దర్ సేవా పురస్కారం



అవార్డు అందుకుంటున్న ఆదాడ మోహనరావు

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 12:(ఆంధ్రజ్యోతి):జనసేన నాయకుడు, గాయకుడు ఆదాడ మోహనరావుకు గద్దర్ జాతీయ సేవా పురస్కారం-2024 లభించింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో తెలంగాణ సాంస్కృతిక చైర్మన్ వెన్నెల గద్దర్, మమత స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పి.గన్నవరం ఎమ్మెల్యే జి.సత్యనారాయణ చేతుల మీదుగా అందుకున్నారు. మోహనరావుకు ఉత్తరాంధ్ర తరపున ఈఅవకాశం దక్కింది. మోహనరావును ఉత్తరాంధ్రకు చెందిన కళాకారులు, రాజకీయ నాయకులు, జనసేన నేతలు అభినందించారు.

జరజాపుపేటలో లేగ దూడల ప్రదర్శన

నెల్లిమర్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో పశు వైద్యశాఖ అధికారుల ఆధ్వర్యంలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 69 ఆవులు, గేదెలకు గర్భ పరీక్షలు, 25 పశువులకు ఇతర చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన లేగ దూడల ప్రదర్శన ఏర్పాటుచేయగా రైతులు 21 దూడలను తీసుకువచ్చారు.కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి వైవీ రమణ, ఆ శాఖ ఉప సంచాలకుడు దామోదరరావు, రాధాకృష్ణ,రాధాకృష్ణ, గరవిడి పశు వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫణీంద్ర, శ్రీలత పాల్గొన్నారు.

పరిశ్రమల సర్వే పూర్తి చేయండి: కమిషనర్

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వ్యాపార, పారిశ్రామిక, రిటైల్, సేవారంగం, పరిశ్రమల సర్వేని త్వరగా పూర్తి చేయాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశించారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమదారుల వివరాలను సేకరించేందుకు ప్రభుత్వం ఎంఎస్‌ఎం ఈ సర్వే చేపట్టిందని తెలిపారు. ఈ మేరకు చిన్న వ్యాపారుల నుంచి పరిశ్రమల వరకూ సేవా రంగంలోని జెరాక్స్ సెంటర్లు, హోటళ్లు తదితర ఎంటర్ ప్రైజెస్‌కు సంబంధించి అన్ని డివిజన్ల పరిధిలో సచివాలయ సిబ్బందితో మొబైల్ యాప్ ద్వారా ఎంఎస్‌ఎంఈ సర్వేని నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో టీపీఆర్‌వో సింహాచలం, ఏవో సీతారామమూర్తి పాల్గొన్నారు.

కేఎల్‌పురంలో గోడల తొలగింపు

లేఅవుట్ల క్రమబద్ధీకరణ, భవన నిర్మాణ అనుమతులపై అసిస్టెంట్ సిటీప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, సిబ్బందితో గురువారం క్షేత్రస్థాయి పరిశీలించారు. ఈమేరకు కేఎల్ పురంలో అదనపు అంతస్తు నిర్మాణం నిమిత్తం వేసిన గోడలను తొలగించారు. అలకవీధి, సిద్దాబత్తులవారు వీధిలో జరుగుతున్న భవన నిర్మాణాల అనుమతులను పరిశీలిం చారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే, ఊపేక్షించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీవో అప్పలరాజు, టీపీఎస్ అనిత, ప్రణాళికా సిబ్బంది పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడాకారులకు అభినందన

శృంగవరపుకోట రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుడివాడలో ఈనెల 14, 15 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులను ఎమ్మెల్సీ, జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుకూరి రఘురాజు అభినందించారు. ఈ మేరకు గురువారం బొడ్డవరలో క్రీడాకారులకు రూ.20వేలతో క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో స్నేహా స్వచ్ఛందసంస్థ అధ్యక్ష, కార్యదర్శులు అట్లూరి శ్రీవెంకటరావు, సుబ్బారావు, కోచ్ శ్రీరాములు పాల్గొన్నారు.

కనక దుర్గమ్మకు ముక్కు పుడక బహూకరణ

చీపురుపల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి):విజయవాడలోని కనకదుర్గఅమ్మవారికి మాజీ ఎమ్మెల్యే గద్దేబాబూరావు కుటుంబసభ్యులు నగదుతోపాటు బంగారు ఆభరణాన్ని కానుకగా సమర్పించారు. బాబూరావు గురువారం కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మనుమడు వేలూరి అమోగ్ అమ్మవారికి 10.5 గ్రాముల బంగారు ముక్కు పుడక బహూకరించారు. అక్కడ జరిగే అన్నదాన కార్యక్రమానికి లక్ష రూపాయలు అందజేశారు. ఆయన మరోమనుమడు అనురాగ్ కూడా ద్వారకా తిరుమల ఆలయానికి పది వేలు అందజేశారు. కార్యక్రమంలో వెంకటనరసమ్మ, లీలా పార్వతి పాల్గొన్నారు.

నిధులు లేక.. నిర్మాణం సాగక

● ఇదీ చినకవులవాడ రైతుభరోసా కేంద్రం పరిస్థితి



శ్లాబ్‌లెవల్‌లో పనులు నిలిచిపోయిన దృశ్యం

భోగాపురం, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినకవులవాడలో రైతుభరోసా కేంద్రం నిర్మాణం నిధులు లేకపోవడంతో నిలిచిపోయింది. వైసీపీ ప్రభుత్వం అక్టోబరు2020లో రూ.21.80 లక్షలతో రైతుభరోసా కేంద్ర నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. అయితే ఆర్బీకే నిర్మాణానికి సం బంధించి నిధులు మంజూరుకాకపోవడంతో భవనం పనులు ముందుకుసాగలేదు. కూటమి ప్రభు త్వం స్పందించి రైతు భరోసా కేంద్రం నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని పలు వురు కోరుతున్నారు. కాగా భవనం పనులు పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని ఎంపీడీవో కిషోర్‌కుమార్ తెలిపారు.

హత్యానేరం కేసులో నిందితుడికి జీవిత ఖైదు

విజయనగరం క్రైం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో నమోదైన హత్యానేరం, అట్రాసిటీ కేసులో జొన్నగుడ్డి ఎరుకులపేటకు చెందిన వారణాసి సూర్యనారాయణకు ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి అప్పలస్వామి జీవిత ఖైదుతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం తెలిపారు. ఎస్పీ కథనం మేరకు.. జొన్నగుడ్డి ఎరుకులపేట ప్రాంతానికి చెందిన వారణాసి సూర్యనారాయణ అదే ప్రాంతానికి చెందిన కామేశ్వరిని కులాంతర వివాహం చేసుకుని జీవిస్తున్నాడు. వీరికి కుమార్తె ఉంది. కొన్నాళ్లు కలిసిఉన్న తర్వాత సూర్యనారాయణ మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగి వచ్చి అనుమానించేవాడు. శారీరక, మానసికంగా వేధిస్తుండడంతో కుమార్తెతో కలిసి వేరే ఇంట్లో కామేశ్వరి ఉంటున్నారు. ఈనేపథ్యంలో ఈ ఏడాది మే 15న సూర్యనారాయణ మద్యం మత్తులో ఇంటికి వచ్చి కామేశ్వరిపై కత్తితో దాడి చేసి గాయపరిచాడు. కామేశ్వరి కుమార్తె వన్‌టౌన్‌లో ఫిర్యాదుచేసింది. దీంతో పోలీసులుఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కామేశ్వరి మృతి చెందడంతో హత్యానేరం కింద కూడా కేసు నమోదైంది. అప్పటి డీఎస్పీ ఆర్.గోవిందరావు దర్యాప్తు చేసి సూర్యనారాయణను అరెస్టుచేశారు. అనంతరం కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేశారు. దీంతో వారణాసి సూర్యనారాయణపై నేరం రుజువు కావడంతో ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి అప్పలస్వామి జీవిత ఖైదుతోపాటు వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

మక్కువ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంబర, ఎస్.పెద్దవలస రహదారి పక్కన ఇటుక బట్టీల వద్ద గురువారం విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. మక్కువ యానాది వీధులకు చెందిన మూడు కుటుంబాలు కొన్నేళ్లగా ఇటుక బట్టీ వద్ద పనిచేస్తున్నాయి. గురువారం ఉదయం బట్టీల వద్ద ఐరెన్‌పైపుతోపాము దూరడాన్ని గమనించిన కర్రి అంజిబాబు(25) పామును బయటపడవేసే క్రమంలో ఐనన్‌పైపును మీదకు లేపగా పైన వేలాడుతున్న విద్యుత్‌తీగలకు ఐరన్ పైపు తగిలి షాక్‌కు గురయ్యాడు. గమనించిన సహచరులు అంజిబాబును శంబర పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యాధికారి కిరణ్‌కుమార్ నిర్ధారించారు. మృతుడికి భార్య శైలు, కుమారుడు ఉన్నారు. అంజిబాబు మృతితో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.

చీటీల కేసులో భార్యాభర్త అరెస్టు

భోగాపురం,డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): చీటీలు, స్కీములు నిర్వహించి సుమారు రూ.రెండు కోట్లు వరకు చీటింగ్ చేసిన భీమిలి మండలంలోని వలందపేటకు చెందిన భార్యాభర్తలు సరగడపార్వతి, లక్ష్మణరెడ్డిలను అరెస్టు చేసినట్లు సీఐ ఎస్వీ ప్రభాకర్ గురువారం తెలిపారు. చెరుకుపల్లిలో చీటీలు, రకరకాల స్కీములు నిర్వహించి గ్రామస్థుల నుంచి సుమారు రూ.రెండు కోట్లు చీటింగ్‌చేసినట్లు ఆ గ్రామానికి చెందిన మజ్జిత్రినాథమ్మ ఫిర్యాదుచేసి నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం అరెస్టు చేసినట్లు తెలిపారు.

చీటీలు నిర్వహించి మోసగించడంతో కేసు నమోదు

భోగాపురంతోటవీధికి చెందిన తిరుమరెడ్డి మురళి చీటీలు నిర్వహిస్తూ మోస గించి పారిపోయాడని గ్రామానికి చెందిన పి.రామకృష్ణ బుధవారంరాత్రి ఫిర్యా దు చేసినట్లు సీఐ ఎస్వీ ప్రభాకర్ తెలిపారు. తోట వీధిలో నివాసముంటున్న తిరుమరెడ్డి మురళి కొద్దేళ్లుగా చీటీలు నిర్వహించేవాడని, ఈనేపథ్యంలో వంద లాది మంది చీటీలు వేసుకున్నారని చెప్పారు. అయితే ఇటీవల సుమారు ఆరు కోట్ల రుపాయల చీటీల నగదు ఇవ్వకుండా పరారైయ్యాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నూర్పుడి యంత్రంలో చేయిపడి ఒకరికి గాయాలు

మక్కువ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ధాన్యం నూర్పు చేపడుతుండగా ప్రమాదశాత్తూ యంత్రంలోకి చేయి పడి వ్యక్తికి తీవ్ర గాయాపాలైన ఘటన మండలంలోని బోరింగువలస గిరిజన గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తాడంగి కృష్ణ ధాన్యాన్ని యంత్రంతో నూర్పు చేపడుతుండగా వరి వాములు యంత్రంలో వేసే క్రమంలో కుడిచేయి లోనికి వెళ్లిపోయింది. దీంతో చేతివేలు ఛిద్రమయ్యాయి. గమనించిన స్థానికులు కృష్ణను చికిత్స నిమిత్తం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

47 మద్యం సీసాల స్వాధీనం

విజయనగరం క్రైం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వంగర మండలంలోని నీలయ్యవలసలో 47 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ రాజశ్రీ తెలిపారు. ఈమేరకు మద్యం విక్రయదారుడు నెల్లి గణేష్‌నాయుడిని అదుపులోకి తీసుకుని తదుపరి చర్యలు నిమిత్తం ఎక్సైజ్, ప్రొహిబిషన్ రాజాం స్టేషన్‌కు అప్పగించినట్టు పేర్కొన్నారు. దాడుల్లో హెచ్‌సీలు నాగేశ్వరరావు, సుదర్శన్, ఈసీలు వినయ్, నాయుడు, మనోజ్‌లు పాల్గొన్నారు.

రాజాంలో 100 సీసాలు..

రాజాం రూరల్,డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాకలివీధికి చెందిన పోలిరాజు, తెర్లాం మండలంలోని పెరుమళికి చెందిన వెంకట అప్పారావుల నుంచి 100 మద్యం సీసాలను రాజాం పోలీసులు గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. రాజాం నుంచి పొగిరి వైపు మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తుండగా ఏఎస్‌ఐ భాస్కరరావు, సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ఈమేరకు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. రాజాం ఎస్‌ఐ రవికిరణ్ కేసు నమోదుచేశారు.

లక్ష్య సాధనకు కృషిచేయాలి

నెల్లిమర్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లక్ష్యాల సాధనకు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు సమన్వయంతో కృషిచేయాలని ఎంపీడీవో కె.రామకృష్ణరాజు కోరారు. గురువారం సర్పంచ్‌లు, గ్రామ సచివాలయాల ఉద్యోగులకు శిక్షణ తరగతులనుప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలుచేసేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శంకర్ జగన్నాథం, ఎంఈవోవిజయ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనపై శిక్షణ

గంట్యాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సుస్థిరాబివృద్ధి లక్ష సాధనపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ హైమావతి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలోని ఎంపీడీవో రమణమూర్తి, ఈవోపీఆర్డీ బానోజీ రావు పాల్గొన్నారు.

'పీఎం సూర్యగర్'పై అవగాహన

కొత్తవలస, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మంత్రి సూర్యగర్ పథకాన్ని వినియోగించుకుని విద్యుత్ బిల్లులను తగ్గించుకోవాలని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సురేష్‌బాబు తెలిపారు. గురువారం మండలంలోని దేశపాత్రునిపాలెంలో సూర్యగర్ పథకంపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 అడుగుల విస్తీర్ణం కలిగిన రూఫ్‌టాప్‌పై సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ అధికాలులు బి.వెంకటరావు, ఐ.అప్పారావు, ఆర్.రవి, సీహెచ్ సూరిబాబు పాల్గొన్నారు.

అప్పుడు ఆదుకోక.. ఇప్పుడు ఓర్వలేక

(5వ పేజీ తరువాయి)



పిచ్చిమొక్కలతో నిండి తోటపల్లి కాలువ

ప్రభుత్వానికి జమ అయింది. దీంతో మార్కెటింగ్ శాఖ సిబ్బందికి సక్రమంగా జీతాలు కూడా చెల్లించలేదు.

'సహకారం' సున్నా...

జిల్లాలో సహకార సంఘాల పరిస్థితి అలాగే ఉంది. ఉమ్మడి జిల్లాలో 92 పీఏసీఎస్‌లు ఉన్నాయి. సహకార రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నా జిల్లాలో ఆ పరిస్థితి కనిపించలేదు. పైగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు రైతు సేవ కంటే వాణిజ్య ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నాయన్న విమర్శ ఉంది. చాలావాటికి సొంత భవనాలు కూడా లేవు. రైతులు పండించే పంటలను ధర వచ్చే వరకూ నిల్వ చేయడం వీటి ప్రధాన విధి. అటువంటిదేమీ జిల్లాలో కనిపించ లేదు. చాలా చోట్ల గొడౌన్ల నిర్మాణం చేపట్టగా ఎనిమిది చోట్ల మాత్రమే పూర్తయ్యాయి. ఐదేళ్లగా రైతుభరోసా కేంద్రాల పేరు చెప్పి. ప్రాథమిక వ్యవసాయ పరపతి సేవా సంఘాల సేవలను పూర్తిగా తొక్కిపెట్టారు. వ్యవసాయ అనుబంధరంగాలను కూడా సర్వనాశనం చేసిన వైసీపీ నేతలు ఇప్పుడు మొసలి కన్నీరుకారుస్తున్నారు.

వైద్య సేవలపై నిర్లక్ష్యం వద్దు

గరుగుబిల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతా ల్లోని హెల్త్, వెల్‌నెస్ కేంద్రా ల్లో వైద్య సేవల పై నిర్లక్ష్యం వహి స్తే చర్యలు తప్ప వని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యక్రమాల అధికారి తెర్లి జగన్మోహ న్‌రావు హెచ్చరించారు. గొట్టివలస, రావుపల్లిలోని ఆరోగ్య కేంద్రాలను ఆయన గురువారం సందర్శించారు. రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆరోగ్య సమస్యలు విధిగా రికార్డుల్లో పొందుపర్చాలని సిబ్బందికి సూ చించారు. రోగులకు పరీక్షల నివేదికలను సకాలంలో తెలియజేయాల న్నారు. కాలం చెల్లిన మందులను కేంద్రాల్లో ఉంచరాదన్నారు. గర్భిణు లు, శిశు గృహాలను సందర్శించి, ఆరోగ్య సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆరోగ్య సమస్యలపై అలసత్వం ప్రదర్శించ వద్దని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి, చిన్నారు ల ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. ఎపిడిమిక్ ఈవో సత్తెబాబు, సూపర్‌వైజర్ జయగౌడ్, సిబ్బంది విజయలక్ష్మి, ఆర్.మంగమ్మ, జానకి, ఆశాకార్యకర్త సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

హస్తకళలపై సెమినార్

పాలకొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డులో ఉన్న కమ్యూనిటీ హాల్లో హస్తకళలపై ఏపీటిడ్కో ఆధ్వర్యంలో గురువారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీతంపేట ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు, హస్తకళల సేవా కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణలక్ష్మి, షెడ్ డైరెక్టర్ పీడీ సుధీర్‌కుమార్, న్యూ హోప్ ఫౌండేషన్ ఛైర్మన్ బేతాళ సుదర్శన్‌బెన్హర్ పాల్గొన్నారు. అపర్ణలక్ష్మి హస్త కళాకారులకు వివిధ పథకాలపై వివరించారు. ఏపీవో చిన్నబాబు మాట్లాడుతూ హస్త కళాకారులకు చేయూతనందిస్తామని చెప్పారు. హస్తకళల సేవా కేంద్రం కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

సారా రవాణాపై డ్రోన్‌తో పర్యవేక్షణ



డ్రోన్‌తో పర్యవేక్షిస్తున్న ఎస్‌ఐ సంతోషికుమారి

పార్వతీపురం రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయి, సారా అక్రమ రవాణాను నిరోధించేందుకే డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ ప్రారంభిస్తున్నట్టు పార్వతీపురం రూరల్ ఎస్‌ఐ సంతోషికుమారి తెలిపారు. గురువారం రావికోన పంచాయతీ ఒడిశా సరిహద్దు గ్రామాలైన చందలంగి, బట్టివలస, కొత్త వలస, రంగాలగూడ గ్రామాల్లో ఆమె పర్యటించి డ్రోన్ సాయంతో సరిహద్దు ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సాంకేతిక బృందం పాల్గొంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): లుంబూరు సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్‌పై నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 13న శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు గాసి వీధి, కస్పా వీధి, రెల్లి వీధి, దేవరపేట, కోమటిపేట, బోనం వీధి, వీవర్స్‌కాలనీ, వెంకమ్మపేట, చిన్నకాపు వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా కు అంతరాయం ఉంటుందని వివరించారు. ● భామిని: భామిని, బత్తిలి ఫీడర్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు జంగిల్ క్లియరెన్స్, మరమ్మతులు చేపడతామని చెప్పారు.

సమయపాలన తప్పనిసరి

మక్కువ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల ఉద్యోగులకు సమయపాలన తప్పనిసరి అని జిల్లా సచివాలయాల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి రామ్‌గోపాల్ అన్నారు. మక్కువ, శంబర, కవిరిపల్లి సచివాలయాలను ఆయన గురువారం సందర్శించారు. హౌస్‌హోల్డ్, ఎన్‌పీసీఐ సర్వేలను వేగవంతం చేయాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు విధిగా తమ పరిధిలోని పాఠశాలలను పర్యవేక్షించాలన్నారు.

హామీ ఇచ్చారు.. మరిచారు



అభివృద్ధికి నోచుకోని ఎస్ఎన్ఎం నగర్‌లోని పార్కు ఇదే.

- అభివృద్ధికి నోచుకోని ఎస్ఎన్ఎం నగర్ పార్కు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పార్వతీపురం పట్టణవాసులు

పార్వతీపురంటౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డులో గల సౌందర్య నారాయణమూర్తి నగర్‌లో ఉన్న పార్కు అభివృద్ధికి నోచు కోవడం లేదు. మున్సిపాల్టీ నిర్వహిస్తున్న ఈ పార్కు అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు హామీలయితే ఇచ్చారు కానీ, ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. దీంతో కాలనీ నివాసితులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ పార్కును సుమారు 18 ఏళ్ల కిందట ఏర్పాటు చేశారు. 2006లో అప్పటి అటవీ శాఖ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు చొరవతో పార్కు అభివృద్ధికి జన్మభూమి నిధులు రూ.5లక్షలు కేటాయించారు. పార్కు అభివృద్ధితో పాటు వాకింగ్ ట్రాక్, పిల్లల ఆట పరికరాలు ఏర్పాటుకు అప్పట్లో కౌన్సిల్ ఆమోదంతో జన్మభూమి నిధులు మంజూరయ్యాయి. అధికారుల పర్యవేక్షణ లోపమో, లేక ప్రజాప్రతి నిధుల నిర్లక్ష్యమో తెలియదు కానీ పనులు మాత్రం చేపట్టలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా పార్కు అభివృద్ధికి నిధులు కేటా యించారు కానీ మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలకే పరిమితం చేశారు. ఈ పార్కు అభివృద్ధిపై ఎస్ఎన్ఎం నగర్ వాసులు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతులు ఇచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఇటీవల స్వచ్ఛ సుందర పార్వతీపురంలో భాగంగా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌తోపాటు, ఎమ్మెల్యే విజయచంద్ర పార్కులో శ్రమదానం చేశారు. ఆ సమయంలో పార్కు అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని, త్వరలో అన్ని మౌలిక సదుపాయా లు కల్పిస్తామని, కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఆ హామీలు ఎప్పటి నెరవేరుతాయో చూడాలి.

నర్సింగ్ అభ్యర్థులకు సౌదీ అరేబియాలో ఉద్యోగావకాశాలు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓంకాప్, ఏఎల్ యూసుఫ్ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్త ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్, పోస్టు బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు సౌదీ అరేబియాలోని రీహేబిలిటేషన్ సెంటర్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈమేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న యువత ఈనెల 15వ తేదీలోగా సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు కావాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు డిసెంబరు 18వ తేదీన ప్రీ అసెస్మెంట్ నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలోని 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న బీఎస్సీ నర్సింగ్ లేదా పోస్టు బీఎస్సీ నర్సింగ్ చదివి ఏదైనా ఆసుపత్రిలో కనీసం ఏడాదిన్నర అనుభవం ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఎంపికైన అభ్యర్థులు సౌదీ అరేబియా దేశంలో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.37,500 (జీఎస్టీ అదనం) చెల్లించాల్సి ఉంటుందని, ఆ మొత్తం నుంచే ఎంపికైన అభ్యర్థుల వీసా ఫీజు, రానుపోనూ విమాన చార్జీలను ఏఎల్ యూసుఫ్ ఎంటర్‌ప్రైజెస్ వారు చెల్లిస్తారని చెప్పారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.78వేల నుంచి రూ.89వేలు జీతం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, విద్యా సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు, జనన ధ్రువీకరణపత్రం, అనుభవ సర్టిఫికెట్, వివాహ ధ్రువీకరణపత్రం, నోటరీ లెటర్, నర్సింగ్ కౌన్సిల్ సర్టిఫికెట్, కొవిడ్, ఎంఎంఆర్ సర్టిఫికెట్ సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. నర్సింగ్ పరిజ్ఞానం, ఇంగ్లీష్ భాషా పటుత్వం, డిజిటల్ నైపుణ్యాలతో ప్రాథమిక పరీక్ష ఆధారంగా అర్హతలను నిర్ణయిస్తారని ఆయన తెలియజేశారు. అర్హత పొందిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 9988853335, 8790118349, 8712655686 నెంబర్లకు సంప్రదించాలని ఆయన సూచించారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

- పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ



భామిని: నిల్వ ఉంచిన పత్తిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక కూటమి పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో వైద్యం, తాగునీటి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని నాయకులకు సూచించారు. సీతంపేట ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. అతి త్వరలో ఇండస్ట్రియల్ సమావేశం నిర్వహించి గిరిజన ఔత్సాహికులను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. నాబార్డ్ నిధులతో సీతంపేటలో పైనాపిల్ ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పేందుకు సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఎన్‌డీఏ కూటమి మండల అధ్యక్షుడు సవరతోట మొఖలింగం, హెచ్‌డీఎస్ మెంబర్ చంద్రశేఖర్, సంజ్ఞ, సర్పంచ్ నీలయ్య, పవన్, హెచ్.ప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడు రంగనాథం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే కూటమి లక్ష్యం

భామిని, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. గురువారం భామిని వచ్చిన ఆయన కూటమి కార్యకర్తలతో సమావేశం అయ్యారు. నీటి సంఘాల ఎన్నికలకు ఓటర్ల జాబితాలో రైతుల పేర్లు తప్పిపోకుండా చూడాలని సూచించారు. రైతుల ఏకాభిప్రాయంతో టీసీలు, ప్రెసిడెంట్‌ను గెలపించుకోవాలన్నారు. ఈసందర్భంగా స్థానిక రైతులు పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఆయన.. ఇళ్లల్లో నిల్వ ఉన్న పత్తిని పరిశీలించారు. భామినిలో పత్తిని కొనుగోలు చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ కిరణ్‌కుమార్, టీడీపీ నాయకులు బి.రవినాయుడు, ఎం.జగదీష్, గోవింద్, ఆనంద్, బి.ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా నవదుర్గ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద వెలసిన నవదుర్గా ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పాల్గొని, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించాలి

బెలగాం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు పాలకులు దృష్టి సారించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు కోరారు. నూతనంగా జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన గురువారం స్థానిక సుందరయ్య భవనంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలని, జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు.

ప్రకృతి విధానాలతోనే ఆరోగ్యం

గరుగుబిల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి పంటలతోనే ఆరోగ్యం సాధ్యమని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.షణ్ముఖరాజు అన్నారు. గురువారం తోటపల్లి జట్టు నూతన కార్యాలయ ప్రాంగణంలో ఆరోగ్య పోషణపై కార్యకర్తలకు ఆయన శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ ఎస్.వెంకట సత్య, ఎన్‌ఎఫ్ఏలు, గుమ్మలక్ష్మీపురం, గరుగుబిల్లి మండలాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఏ-1 పరీక్షల పరిశీలన

బొబ్బిలి రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జె.రంగరాయపురం ఎంపీపీ ఎస్ డీపీఈపీ పాఠశాలలో గురువారం నిర్వహించిన సమ్మేటివ్ ఎసెస్‌మెంట్-1 పరీక్షలను ఎంఈవో -1 లక్ష్మణరావు పరిశీలించారు. పరీక్షలను సజావుగా నిర్వహించాలని హెచ్‌ఎంలకు ఆదేశించారు. అలాగే చింతాడ ఎంపీపీ పాఠశాలలో నిర్వహించిన పరీక్షలను ఎంఈవో-2 గొట్టాపు వాసుదేవరావు పరిశీలించారు.

మానసిక దివ్యాంగుల సంక్షేమానికి వితరణ

బొబ్బిలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్సీఎం చర్చి దగ్గర గల నిర్మల్ హృదయ్ దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో గురువారం కారుణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఫౌండేషన్ ఛైర్మన్ జేసీ రాజు-పీవీఏ మెర్సిరాజు దంపతులు మానసిక దివ్యాంగుల సంక్షేమం కోసం రూ.25 వేలు వితరణగా అందజేశారు. సిస్టర్ నిర్మల, సునీత, మేరీ పాల్గొన్నారు.

బయోమెట్రిక్‌తో వివరాలు నమోదు చేసుకోవాలి

సీతంపేట రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మిస్సింగ్ సిటిజన్స్ వివరాలను వారి బయోమెట్రిక్ ద్వారా నమోదు చేసుకోవాలని ఎంపీడీవో కె.గీతాంజలి తెలిపారు. గురువారం ఆమె సోమగండి సచివాలయాన్ని సందర్శించారు. అక్కడి ప్రజలతో మాట్లాడారు. లేట్ డేట్ ఆఫ్ బర్త్ ధ్రువపత్రాల కోసం సంబంధిత పత్రాలతో వచ్చినట్లయితే సచివాలయంలోనే నమోదు చేస్తామని ఆమె చెప్పారు. దీనిని ఆర్డీవో కార్యాలయం మంజూరు చేసిన వెంటనే సచివాలయంలో డేట్ఆఫ్ బర్త్ సర్టిఫికేట్ ఇస్తా మని తెలిపారు. వీలైనంత త్వరగా ఇవి వచ్చేటట్లు చూడాలని ఎంపీడీవో వీఆర్వోలకు సూచించారు. హౌస్‌హోల్డ్ సర్వేలో పేర్లు నమోదు కాని గ్రామస్థులు మిస్సింగ్ సిటిజన్ సర్వేలో తప్పనిసరిగా బయోమెట్రిక్ ద్వారా నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ పరిశీలనలో ఆమెతో పాటు సోమగండి, కిరప పంచాయతీ కార్యదర్శులు ఎస్.సింహాచలం, వీఆర్వో తులసీబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ అక్కరాజు, మహిళా సంరక్షణ అధికారి యమున తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల డెప్యుటేషన్లు రద్దు చేయాలి

సీతంపేట రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధీనంలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 25 మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులను పాడేరు ఐటీడీఏ పరిధిలో వివిధ గురుకుల పాఠశాలలకు డెప్యుటేషన్‌పై వేయడం అన్యాయమని డీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా గౌరవ అధ్యక్షుడు కోత ధర్మారావు అన్నారు. ఈ మేరకు గురువారం సీతంపేటలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డెప్యుటేషన్లు అవసరం మేరకు మండల పరిధి, జిల్లా పరిధిలో వేస్తారు కానీ ఇలా ఇంకొక జిల్లాకు వేయడం చాలా దారుణమని, దీనిపై తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతాడ రఘురాంస్వామి, కార్యవర్గ సభ్యుడు బి.రమణమూర్తి ఉన్నారు.

వసతి గృహాల మరమ్మతులకు రూ.1.20 కోట్లు

బొబ్బిలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో గల సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాల మరమ్మతుల కోసం ప్రభుత్వం సుమారు రూ.కోటి 20లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే బేబీ నాయన తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గల సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో వసతుల మెరుగుదల కోసం బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించినట్టు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామి తెలిపారని చెప్పారు. బొబ్బిలి నియోజకవర్గ పరిధిలోని హాస్టళ్లలో తక్షణం పనులను ప్రారంభించి వచ్చే నెలాఖరు కల్లా పూర్తి చేయాలని అధికారులకు సూచించామని తెలిపారు. ఈ పనుల పురోగతిని, పర్యవేక్షణ బాధ్యతలను చూడాలని మంత్రి తనను కోరినట్టు తెలిపారు.

సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

బొబ్బిలి రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడాలన్నా, అభివృద్ధిలో ముందుకు దూసుకు పోవాలన్నా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించే దిశగా పనిచేయాలని డీఎల్‌డీవో ఎం.కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మూడో రోజు అన్ని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల అభివృద్ధిపై ప్రణాళికలు అనే అంశంపై ఎంపీడీవో రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణలో ఆయన పాల్గొని, మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో ప్రతిఒక్కరూ పని చేయాలన్నారు. ఏడీఏ ఎం.శ్యామ్‌సుందర్, ఈవోపీఆర్డీ భాస్కరరావు, వ్యవసాయ అధికారి శ్యామ్‌సుందర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యలు పరిష్కరించండి



పోస్టర్ విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బొబ్బిలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా విద్యా రంగ సమస్యలు యథాతథంగానే ఉన్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.రాము ఎద్దేవా చేశారు. బొబ్బిలిలో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ మండల మహా సభల్లో ఆయన గురువారం పాల్గొని, ప్రసంగించారు. నియోజకవర్గ పరిధిలో జూనియర్, డిగ్రీ కళాశాలల మంజూరు మాట మరిచారన్నారు. సంక్షేమ హాస్టళ్లలో అనేక సమస్యలు తిష్టవేసి ఉన్నాయని విమర్శించారు. అనంతరం 19మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా శివ, అధ్యక్షుడిగా కిరణ్ ఎన్నికయ్యారు. ఈనెల 21, 22 తేదీలలో జరగనున్న జిల్లా మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు చినబాబు, మండల కార్యదర్శి మణికుమార్ పాల్గొన్నారు.

అటవీ శాఖాధికారుల్లో చలనం

బొబ్బిలి రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గోపాలరాయుడుపేట, బొడ్డవలస, మల్లమ్మపేట గ్రామాల పరిధిలో ఆక్రమణలకు గురవుతున్న రిజర్వు ఫారెస్టుపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'నారాయణ వనం అసలుందా' అనే కథనంతో అటవీ శాఖాధికారుల్లో చలనం వచ్చింది. ఆక్రమణలపై సమాచారం సేకరించేందుకు బుధవారం సంబంధిత అటవీ ప్రాంతంలో స్పెషల్ స్క్వాడ్ పర్యటించింది. అయితే ఎటువంటి చర్యలు తీసుకున్నారో బహిర్గతం చేయడం లేదు. స్థానిక ఫారెస్టు బీట్ అధికారి స్వప్నను వివరాలు అడగగా, ఉన్నతాధికారులు ఇక్కడి విషయాలను ఎవరికీ వెల్లడించవద్దని ఆదేశించారని చెప్పారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

బొబ్బిలి రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రత్యేక అధికారి ఎం.నూకరాజు కోరారు. పిరిడి గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రైతులకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా రెవెన్యూ సదస్సులో తెలియజేస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. అనంతరం తహసీల్దార్ ఎం.శ్రీను మాట్లాడుతూ ఈ సద స్సులు వచ్చే నెల 8వ తేదీ వరకు రెవెన్యూ గ్రామా ల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహిస్తా రని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ శివన్నాయుడు, సర్వేయర్ సతీష్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ స్వప్న, వీఆర్వో నాగరత్నం పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నూతన బస్సు సర్వీసు ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం డిపోకు చెందిన ఆర్టీసీ నూతన బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నట్టు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. ఈ బస్సు ఉదయం ఆరు గంటలకు నీలకంఠాపురం బయలుదేరి గుమ్మలక్ష్మీపురం, బత్తిలి, కొత్తూరు మీదుగా శ్రీకాకుళం చేరుతుందని, తిరిగి రాత్రి నీలకంఠాపురం వస్తుందని చెప్పారు. ఈ బస్సు సర్వీసు గిరిజన ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

కొత్త చార్టులు అమలు చేయాలి

సాలూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సాలూరు ఆర్టీసీ డిపోలో కొత్త చార్టులు, 1/2019 సర్క్యులర్లను అమలు చేయాలని ఆర్టీసీ కార్మికులు కోరారు. ఈసందర్భంగా గురువారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొత్త చార్టులు, గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఇచ్చిన సర్క్యులర్లను అమలు చేయాలని కోరారు. లేకుంటే ధర్నాలు ఉధృతం చేస్తామని తెలిపారు. పలువురు ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

To,
1.Chakka Santosh S/o Late Ramamohan, Aged 36 Years,R/o Door.No.9-7-16. Plot No.304, Paila palace, Near Rama Talkies Junction A.U. Engineering College, C.V.M Compound, Visakhapatnam Urban, Visakhapatnam District.
2.Chakka Balachandra S/o Late Ramamohan, Aged 34 Years,R/o Door.No.9-7-16. Plot No.304, Paila palace, Near Rama Talkies Junction A.U. Engineering College, C.V.M Compound, Visakhapatnam Urban, Visakhapatnam District.
3.Chakka Manideep S/o Late Ramamohan, Aged 36 Years,R/o Door.No.9-7-16. Plot No.304, Paila palace, Near Rama Talkies Junction A.U. Engineering College, C.V.M Compound, Visakhapatnam Urban, Visakhapatnam District.
4.Chakka Siddhardh S/o Late Venkateswararao, Aged 30 Years, Door.No.24-141/2, Main Road, Parvathipuram , Vizianagaram District.
5.Chakka Varsha D/o Late Venkateswararao, Aged 28 Years, Door.No.24-141/2, Main Road, Parvathipuram , Vizianagaram District.
6.Chakka Suryateja S/o Late Ravisankar, Aged 22 Years, Near LIC Building, Rajam, Srikakulam District.

Ref:-W.P 31157 of 2022

Take notice that my client **Smt. Theegala Lalitha**,has filed the above WP 31157 OF 2022 , before the Hon'ble High court of Judicature for the state of Andhra Pradesh. The above WP 31157 OF 2022, came up for hearing on **02-12-2024** before his Lordships Hon'ble Sri Justice **R RAGHUNANDAN RAO AND** Honourable Sri Justice **HARINATH.N.** The court directed me to take out fresh personal notice on you and posted the above matter on **30-12-2024.** You are hereby informed to make appearance either in person or through your advocate on or before **30-12-2024.** Otherwise the matter will be decided ex-Partie This is for Your information.

Date: 12-12-2024
Place: Amaravathi

SWATI GUDA
Advocate,
Cell: 98486 29551